
## కెటిఆర్ పర్యటనకు సంఘీభావం




ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 06 జులై, 2026 | పేజీలు :04

# మహిళలు స్వయం ఉపాధితో కుటుంబ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలి





**ప్రజాపక్షం/రాయికల్ :** మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించి ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో సఖి సంకల్ప మహిళా కమ్యూనిటీ ఆధ్వర్యంలో రాయికల్ పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో 15 వ్యాపార స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపకురాలు సుకన్య సిద్ధార్థ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమలోని ప్రతిభను వెలికితీసుకుని స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. స్టాల్స్‌లో మహిళల చేత తయారైన వస్తువులు, హ్యాండీక్రాఫ్ట్స్, జూట్ ఉత్పత్తులు,గృహోపయోగ వస్తువులు, ఫ్యాషన్ ఉత్పత్తులు తదితర వాటిని ప్రదర్శనతో పాటు విక్రయానికి ఉంచినట్లు పేర్కొన్నారు.సఖి సంకల్ప సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు డిజిటల్ స్కిల్స్,కంప్యూటర్ కోర్సులు, బ్యూటీషియన్, టైలరింగ్, జూట్ బ్యాగ్ తయారీ, సోషల్ మీడియా ప్రమోషన్, ఈకామర్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్క్ ఫ్రం హోమ్ అవకాశాలు వంటి పలు రంగాల్లో శిక్షణలు అందిస్తున్నామని తెలిపారు.అదేవిధంగా త్వరలో రాయికల్‌లో సఖి సంకల్ప ఆధ్వర్యంలో జూట్ బ్యాగ్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు సుకన్య సిద్ధార్థ్ వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పర్యావరణ హిత ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో మహిళా పారిశ్రామికవేత్తలు,స్వయం సహాయక సంఘాల సభ్యులు,స్థానిక మహిళలు పాల్గొని స్టాల్స్‌ను సందర్శించి నిర్వాహకులను అభినందించారు.

## చినుకు పడితే కాలనీ బురదమయం



**ప్రజాపక్షం/మల్లాపూర్:** మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీ నాలుగో వార్డులోని నిత్యం జనాలు నడిచే ప్రధాన కాలనీలో మట్టి రోడ్డు పూర్తిగా గుంతలుగా ఏర్పడి చినుకు పడితే బురద మాయమై అడుగు తీసి అడుగు వేయాలంటే ఎంతో కష్టంగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామంలో అన్ని కాలనీలో సీసీ రోడ్లు డ్రైనేజీలు నిర్మిస్తూ అభివృద్ధి చేస్తున్నారని తాము కూడా ఇదే గ్రామంలో ఉన్నామని కాలనీని ఎందుకు పట్టించుకోవడంలేదని అధికారులను ప్రజా ప్రతినిధులను కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు పాలకవర్గ సభ్యులు దృష్టి సారించి వర్షం తాము పడుతున్న ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నా రు.

## కార్పొరేటర్‌ల 'ఫోన్' టెండర్లను రద్దు చేయాలి




## చౌడాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే మేడిపల్లి




## ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రంగులు



# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్!



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలోని ముత్తారం మండలంలో ఆదివారం ఉదయం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన భారత్ రాష్ట్ర సమితి పార్టీ ముఖ్య నాయకులను, కార్యకర్తలను ముత్తారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శన కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో,ముత్తారం మండల నాయకులు అక్కడికి వెళ్లకుండా పోలీసులు ఈ ముందస్తు చర్యలు చేపట్టారు. తెల్లవారుజాము నుంచే పోలీసులు బీఆర్ఎస్ నాయకుల ఇళ్లకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని, ముత్తారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.పోలీసుల ముందస్తు అరెస్టులపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు.రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శనకు వెళ్తుంటే,అక్రమ నిర్బంధాలకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ శ్రేణులు ధ్వజమెత్తాయి.అక్రమ అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరని నాయకులు స్పష్టం చేశారు.

## వారం రోజుల్లో అభివృద్ధి పనులు ప్రారంభించకపోతే మున్సిపల్ ముట్టడి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 26 వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధులతో వారం రోజుల్లో పనులు ప్రారంభించకపోతే భారీ స్థాయిలో మున్సిపల్ ముట్టడి కార్యక్రమం చేపడతామని బీజేపీ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్, వైస్ ఫ్లోర్ లీడర్ బొడ్ల ఆనంద్‌తో కలిసి ఆయన మాట్లాడారు.మెట్‌పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను రాజకీయాలకు అతీతంగా వెంటనే ప్రారంభించాలని,అధికార పార్టీ నేతల జోక్యం లేకుండా అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వైకుంఠధామాలు తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరై, కాంట్రాక్టర్లతో ఒప్పందాలు పూర్తయినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడానికి అధికార పార్టీ నాయకుల జోక్యమే కారణమని ఆరోపించారు.అభివృద్ధి విషయంలో అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.అభివృద్ధి పనుల్లో భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఆందోళనలు,పోరాటాలు నిర్వహించేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో మెట్‌పల్లి మున్సిపాలిటీలో అధికారులు విధులు నిర్వహించడానికి భయపడుతున్నారని, కొందరు బదిలీల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనికి పూర్తి బాధ్యత అధికార పార్టీయేనని పేర్కొన్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు,వైకుంఠధామాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, లేనిపక్షంలో వారం రోజుల అనంతరం భారీ స్థాయిలో మున్సిపల్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మిట్టపల్లి కృష్ణమూర్తి, బత్తుల జగదీష్,నూనె క్రాంతి భాస్కర్, లోలపు అనిల్, పాసుకంటి శ్రీనివాస్,భాస్కరాచారి,భోగ దత్తు,రామస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల హెచ్చరికలు బేఖాతరు

### ఆదర్శ పాఠశాలలో మళ్లీ భద్రతా నిర్లక్ష్యం

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని దర్యాపూర్ ఆదర్శ పాఠశాలలో భద్రతా వ్యవస్థ మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల అధ్యాపకులు, ఎంఈఓ ఆదేశాలు ఉన్నప్పటికీ రాత్రి విధులు నిర్వహించాల్సిన నైట్ వాచ్‌మన్ రాత్రి వేళల్లో విధులకు హాజరుకాకుండా,ఉదయం వచ్చి సాయంత్రానికి వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రాత్రి సమయంలో పాఠశాల పూర్తిగా భద్రత లేకుండా ఉండిపోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో విలువైన కంప్యూటర్లు, ప్యానెల్ బోర్డులు, ఇతర సామగ్రి ఉండటంతో పాటు అటవీ ప్రాంతంలో ఉండడం వల్ల విషసర్పాలు, వన్యప్రాణులు ప్రాంగణంలోకి వచ్చే ప్ర మాదం కూడా ఉందని చెబుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఈ పరిస్థితి కొనసాగుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## మల్లాపూర్ ఎస్ఐపై చర్యలు తీసుకోండి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** రత్నాపూర్ గ్రామంలో గొర్రెల కాపరిగా పనిచేస్తున్న దళిత కులానికి చెందిన చిత్తరి నరసయ్యను, విచారణ పేరిట పోలీస్ స్టేషన్కు పిలిచి చిత్రహింసలకు గురిచేసిన మల్లాపూర్ ఎస్సై పై చర్యలు తీసుకోవాలని బాధితుడు నరసయ్య దళిత సంఘాల నాయకులతో కలిసి మెట్పల్లి డిఎస్పికి ఫిర్యాదు చేశాడు. బాధితుడు నరసయ్య తెలిపిన ప్రకారం రాఘవపేట గ్రామానికి చెందిన వ్యక్తి గొర్రెపోతు దొంగతనానికి గురైందని, తనను పోలీస్ స్టేషన్కు పిలిచి నువ్వే దొంగతనం చేశావు అంటూ బూతులతో దుర్భాషలాడుతూ నానా ఇబ్బందులు గురి చేశాడని, తనపై అకారణంగా దాడి చేసి దుర్భాషలాడిన మల్లాపూర్ ఎస్సై పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలంటూ డిఎస్పి కి ఇచ్చిన ఫిర్యాదులో కోరాడు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే దంపతులు



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేషనపల్లి గ్రామానికి చెందిన పప్పు స్వరూప చంద్రమౌళి కూతురి వివాహం ఆదివారం ముత్తారం కేంద్రంలోని వెంకట లక్ష్మి ఫంక్షన్ హాల్ లో వివాహం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్,ఆయన సతీమణి పుట్ట శైలజ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వారి వైవాహిక జీవితం అన్యోన్యంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పప్పు కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధాటి రవీందర్ రావు, ఓడేడ్ సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి,మాజీ ఎంపీపీ లక్కారం సర్పంచ్ అత్తె చంద్రమౌళి,మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్,నాయకులు గిరి వీరేందర్,గాధం శ్రీనివాస్,రామగాళ్ల మధుకర్ తో పాటు పాల్గొన్నారు.

## అంతిమ యాత్రకు వైకుంఠ రథం వితరణ



**ప్రజాపక్షం/రామడుగు :** తన తల్లిదండ్రులు తోట బుచ్చమ్మవెంకటమ్మల జ్ఞాపకార్థం అంతిమ యాత్ర కోసం వైకుంఠ రథాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయానికి విరాళంగా ఇచ్చి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు ఎన్నారై తోట సత్యం. ఆదివారం మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో వైకుంఠ రథాన్ని తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పంచాయతీ పాలకవర్గం సభ్యులు ఎన్నారై తోట సత్యంను శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తోట సత్యం మాట్లాడుతూ తాను చిన్నతనంలో ఎన్నో కష్టాలను ఎదుర్కోని ఉన్నత స్థాయికి ఎదిగి విదేశాల్లో మంచి స్థానంలో ఉన్నానని అందుకు గ్రామ ప్రజల ఆశీర్వాదమే కారణమని పేర్కొన్నారు. తాను పడిన కష్టాలు ఇతరులు పడొద్దు అనే ఉద్దేశంతో గత ఎనిమిది సంవత్సరాలుగా తన తల్లిందద్రుల జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీకి బాడీ ఫ్రీజర్‌తోపాటు గ్రామంలోని వృద్ధులకు, వితంతువులకు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు తనవంతు సహాయ సహకారాలు నెల నెలవారిగా అందిస్తున్నానని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా తన తల్లిదండ్రుల పేరు మీద మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఏవైనా సమస్యలు ఉంటే తన ఛారిటీ సభ్యులను సంప్రదించి వాటిని పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోయిజ్, ఉప సర్పంచ్ పెందోట రాజు, పాలకవర్గ సభ్యులు, ఛారిటీ సభ్యులు నాగి శేఖర్, శ్రీనివాస్, చందా అనిల్, అశోక్ కర్ణ శ్రీనివాస్ సిరిగిరి వెంకటేశ్ అశోక్‌లు పాల్గొన్నారు.

## బాశెట్టి హరీష్‌కు గంజువాడకట్టు సంఘం ఘన సన్మానం



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** ఇటీవల శ్రీకాళహస్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ పాత్రికేయ అవార్డు అందుకున్న ప్రజాపక్షం జాతీయ తెలుగు దినపత్రిక మెట్‌పల్లి విలేకరి బాశెట్టి హరీష్‌ను గంజువాడకట్టు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పడిగల శ్రీనివాస్ మాట్లాడుతూ తమ జాతికి చెందిన బిడ్డ బాశెట్టి హరీష్ ఉత్తమ పాత్రికేయ అవార్డు అందుకోవడం గర్వకారణమని అన్నారు.ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి,అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న హరీష్ మరింత ఉన్నత స్థాయికి చేరుకుని, భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు దొంతుల పవన్, దొంతుల ఆంజనేయులు,పాంపట్టి అరుణ్,మహాజన్ సతీష్,దేవరశెట్టి శ్రీనివాస్,సంఘ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## భూరం వెంకటేష్ స్మృతికి చిరస్మరణగా స్టెయిన్‌లెస్ స్టీల్ మృతదేహ పాడె విరాళం



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** గత నెలలో మరణించిన భూరం వెంకటేష్ స్మృతిని చిరస్థాయిగా నిలుపుతూ గ్రామ ప్రజల సౌకర్యార్థం 11వ వార్డు మాల సంఘం ఆధ్వర్యంలో స్టెయిన్‌లెస్ స్టీల్ మృతదేహ పాడెను గ్రామ పంచాయతీకి అందజేశారు.అంతిమ యాత్రలు, అంత్యక్రియల సందర్భంగా మృతదేహాన్ని తరలించేందుకు గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా ఈ స్టీల్ పాడెను విరాళంగా అందించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. భూరం వెంకటేష్ జ్ఞాపకార్థం చేపట్టిన ఈ సేవా కార్యక్రమం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్, కోమిరెడ్డి మోహన్ రెడ్డి, బైన శ్రీనివాస్, మోర్తాడ్ మురళి, భూరం సురేష్,భూరం సంజీవ్, రాజు, రాజేష్, రామచందర్, రవి, తిరుపతి, రాజ్‌రామ్, కాయిత మహేష్,నరేందర్, ప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ప్రహరీ జర పట్టించుకోండి సారూ!



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల ప్రహరీ శిథిలావస్థకు చేరి కూలిపోతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. గత మూడు నాలుగు సంవత్సరాలుగా ప్రహరీ గోడ పలువు తీసి ఒకవైపు వంగి ప్రమాదపు అంచున ఉన్నప్పటికీ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకునే నాధులే కరువయ్యారని, విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని జర పట్టించుకోండి సార్ అంటూ వేడుకుంటున్నారు. ఇటీవలే పాఠశాలను నూతన హంగులతో తీర్చిదిద్దిన అధికారులు శిథిలావస్థలో ఉన్న ప్రహరీ గోడను పట్టించుకోకవడం సరైనది కాదని కాలనీలోని యువకులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మండల స్థాయి అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే ప్రహరీ గోడను సరి చేసి పొంచి ఉన్న ప్రమాదాన్ని తొలగించాలని కోరుతున్నారు.

# కాళేశ్వరం వైఫల్యంపై కెటిఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

## తలకిందులుగా తపస్సు చేసినా మరో 10 ఏళ్లు ప్రజలు మిమ్మల్ని నమ్మరు

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ :** కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ తీరుపై వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, ప్రాజెక్టు వైఫల్యం, రాష్ట్ర ఖజానాపై పడిన భారీ భారం వంటి అంశాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాజీ ముఖ్యమంత్రికి ఉందని పేర్కొన్నారు.ప్రజల సొమ్ముతో నిర్మించిన అతిపెద్ద ప్రాజెక్టు విషయంలో జరిగిన తప్పిదాలపై కనీస పశ్చాత్తాపం కూడా లేకుండా వ్యవహరించడం బాధాకరమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, అమలు, నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలకు బాధ్యత వహిస్తూ ముందుగా తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రాజెక్టును సందర్శించడం ద్వారా ప్రజలు జరిగిన నష్టాన్ని మర్చిపోతారని భావించడం అవాస్తవమన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని, ఆ ప్రభావాన్ని తెలంగాణ ప్రజలు ఇప్పటికీ అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. అప్పుల భారం, ఆర్థిక అవ్యవస్థ, అభివృద్ధి పేరుతో జరిగిన వ్యయ విధానాల కారణంగా రాష్ట్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములమని చెప్పుకునే నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు.



ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్ పాలనకు ప్రజాస్వామ్య పద్ధతిలో స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ఆ తీర్పు వెనుక ఉన్న కారణాలను ఆ పార్టీ నాయకత్వం ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని సూచించారు.ప్రస్తుత ప్రభుత్వం పారదర్శకత, బాధ్యతాయుత పాలనతో రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తోందని, గత పాలనకు, నేటి పాలనకు మధ్య ఉన్న తేడాను తెలంగాణ ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలను మరోసారి భావోద్వేగాలతో లేదా ప్రచారంతో మభ్యపెట్టే ప్రయత్నాలు విజయవంతం కావని, తెలంగాణ ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకునే స్థాయిలో ఉన్నారని అన్నారు.

## సిసి రోడ్డు ప్రారంభోత్సవం



**ప్రజా పక్షం / హనుమకొండ టౌన్ :** గుండ్ల సింగారం రెండో డివిజన్ పరిధిలోని జి విఎస్ ఆర్ కాలనీ అభివృద్ధిలో భాగంగా సిసి రోడ్డు ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో రెండో డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అజయ్, గ్రామ అధ్యక్షుడు రాజన్న, కాంట్రాక్టర్ నాగేశ్వరరావు సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉండి కాలనీని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జి విఎస్ ఆర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుక్కల రాజు, ఉపాధ్యక్షుడు రుద్రారపు ప్రశాంత్, తాండూరు గోపి, కుక్కమూడి వంశీ, పరుమాత్మ, మరియు కాలనీవాసులు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియపై బిఎల్ఎలకు దిశానిర్దేశం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు వారి కుమార్తె డాక్టర్ శ్రీగోదా విష్ణు రెడ్డి శనివారం బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో 30, 48, 57, 58 డివిజన్ల బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎలు), డివిజన్ ఇన్‌చార్జీలు, అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశమై ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై సవివరంగా మార్గనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ ఫారాలను నిబంధనలకు అనుగుణంగా ఖచ్చితంగా పూర్తి చేయడం, ఓటర్ల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయడం, అవసరమైన సవరణలు చేయడం, ప్రతి



అర్హత కలిగిన ఓటరికి పూర్తి సహకారం అందించడం వంటి అంశాలపై బిఎల్ఎలకు సూచనలు చేశారు.అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని, ప్రతి ఓటరు హక్కు పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంబంధిత డివిజన్ ఇన్‌చార్జీలు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నా రు.

## మల్రిపల్లిగూడెం గ్రామ అభివృద్ధే లక్ష్యం

**ప్రజాపక్షం/ కమలాపూర్:** ప్రజల సహకారంతో మల్రిపల్లి గూడెం గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరం పనిచేయాలని గ్రామ సర్పంచ్ కదురు కవిత తిరుపతి అన్నారు. గ్రామం కోసం ప్రతి శని, ఆదివారం శ్రమదానం కార్యక్రమాన్ని గ్రామ పాలకవర్గం గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్క రు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం బోయ వాల్మీకి సంఘం పలు వార్డుల నుండి శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడేం రాజేందర్, వార్డు సభ్యు లు వంగ రమేష్, రావుల వాణి వెంకటేష్, చేనుమల్ల సాంబరాజు, బత్తిని కవిత, పొలు కొమురయ్య, భారతి, రావుల సమ్మయ్య, పులి నాగరాజు, రవి, కారోబార్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



## పిల్లలు ప్రభుత్వ బడిలో చేరితే... ఇంటి పన్ను, నల్ల, నీటి పన్ను మేమే కట్టేస్తాం

**ప్రజాపక్షం/ కమలాపూర్:** ఆనాడు ప్రభుత్వ పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు ఉండేవారు. ఆనాటి కొంత మంది ప్రభుత్వ ఉపాధ్మాయుల నిర్లక్ష్యానికి నేటి ప్రభుత్వ ఉపాధ్యాయులకు శాపంగా మారింది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికై మండలంలోని దేశరాజుపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు 1వ తరగతి నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్ళకుండా తమ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని, అలా చదువుకున్న విద్యార్థుల ఇంటికి సంబంధించిన ఇంటి, నల్ల, నీటి పన్ను తామే చెల్లిస్తామని, కరప్రతాలు, మైకుల ద్వారా గ్రామంలో ప్రచారం చేస్తూ ఎవరు ఊహించని రీతిలో ప్రత్యేక ఆఫర్ పెట్టి గ్రామ ప్రజలలో చైతన్యాన్ని నింపుతున్నారు. నాడు ప్రభుత్వ పాఠశాలలంటే ప్రజలకు ఎంతో గౌరవం, భక్తి జ్ఞానాన్ని పెంచే దేవాలయాలు, గురువుల పై నమ్మకం ఉండి పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చదివించేవారు. టెక్నాలజీ పెరిగినా కొద్ది ప్రభుత్వ ఉపాధ్యాయులలో విద్య బోధించడంలో మరింత పట్టు ఉన్నప్పటికి పాఠశాలలో సరైన విద్యార్థులు లేక అల్లాడుతున్నారు కొంత మంది ఉపాధ్యాయులు. ఇంగ్లీష్ మీడియం పేరుతో అనేక ప్రైవేటు పాఠశాలలు పుట్టుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల



సంఖ్యను గణనీయంగా తగ్గించి పూర్తిగా నిర్వీర్యం చేశాయి. ఇదంతా ప్రభుత్వం గమనించేంత వరకు గ్రామాలలో ఉన్న విద్యార్థులు కాస్త పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల హంగులు, ఆర్భాటాలు చూసి తమ పిల్లలను కూలి పని చేసైనా బాగా చదివించాలనే ఉద్దేశ్యంతో ప్రైవేట్ పాఠశాలలకు పంపించారు. దీంతో ఆర్థికంగా, మానసికంగా అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, ఇందుకు కారణం ప్రభుత్వామా..? ప్రజలేనా...? అని అర్థం కాని పరిస్థితి నెలకొందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ప్రైవేట్ పాఠశాలల్లో చెప్పే ఉపాధ్యాయుల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బోధించే ఉపాధ్యాయులు ఎంతో శ్రమంచి ఉపాధ్యాయ పోస్టులను సంపాదించుకున్నారు. అలాంటి వారి వద్ద నుండి జ్ఞానాన్ని విద్యార్థులు ఎక్కువగా పొందే అవకాశం ఉంది. అలాంటి ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేసి ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను పంపడం వల్ల ఎంత వరకు వారిలో జ్ఞానం పెరుగుతుందని అర్థం చేసుకోవాల్సిన అవసరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఉంది. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో పంపించడంతో సరిపోదు... వారి పిల్లలు విషయపరిజ్ఞానాన్ని ఎంత వరకు సాధించుకుంటున్నారు... తమ పిల్లలకు ఇంకా ఎలాంటి బోధన అందిస్తే బాగుంటుందని ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ప్రశ్నించే తల్లిదండ్రులు ఉండాలి, అప్పుడే విద్యార్థులోను, ఉపాధ్యాయులలో పట్టుదల పెరిగి ఉన్నతమైన స్థానాన్ని పొందేందుకు ఎంతో దోహదపడుతుంది. ప్రతి విద్యార్థికి సం పూర్ణ జ్ఞానాన్ని అందించేందుకు ఉపాధ్యాయుల పాత్ర ఎం తో కీలకం, అలాంటి ఉపాధ్యాయులను గౌరవిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామ ప్రజలతోనే సాధ్యం. ప్రభుత్వాన్ని పరిపాలంచే పాలకులకు సైతం ప్రజలే ప్రశ్నించి విద్యార్థుల భ విష్యత్తుకు పునాది వేసే వ్యక్తులవుతారు. దేశరాజుపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి, గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుతారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పాఠశాల షెడ్ల నిర్మాణం కోసం సాయం



**ప్రజాపక్షం/ కమలాపూర్:** కమలాపూర్ మండలంలోని మాదన్నపేట ఎంపిపిఎస్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని గమనించిన గ్రామ వాస్తవ్యులు గంగు ప్రభాకర్ రావు గతంలో పాఠశాల కోసం ఆర్థిక సహాయం చేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకున్న గ్రామ వాస్తవ్యులు బుర్ర సుధాకర్ రెండు తరగతి గదుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో ఆదివారం భూమి పూజ చేశారు. గ్రామ సర్పంచ్ కత్తి రమేష్ పాలక మండలి ఏఏపిసి చైర్మన్ వసంత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం / నర్సంపేట :** సిఎంఆర్ఎఫ్ చెక్కులను మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ అదివారం లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నాలుగు లక్షల రూపాయలు చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. అనారోగ్యంతో డబ్బు ఖర్చు చేసుకొని ఇబ్బందుల్లో ఉన్న 29వ డివిజన్‌కు చెందిన నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 4 లక్ష రూపాయల చెక్కులు ఇవ్వడంతో వాటిని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సంగెపు అరుణ భర్త సారంగంకు 1లక్ష 58 వేల నాలుగు వందలు, ఠాకూర్ రవీందర్ సింగ్ (చిన్న)కు 1లక్ష 27వేల ఆరు వందలు, నెల్లుట్ల మౌనిక (ఇడ్లీ బండి లత)కు 93 వేలు, ఎండి ఫరీదా భర్త యాకూబ్ కు 15 వేలు మొత్తం 3లక్షల 94 వేల రూపాయల విలువైన చెక్కుల అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, తోకల శ్రీనివాస్, వేముల బిక్షపతి, కార్తీక్, కటారి ఉత్తమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## దశ దిన కర్మలకు బియ్యం పంపిణీ

**ప్రజాపక్షం/తాడ్వాయి:** తాడ్వాయి మండల పరిధిలోని అంకంపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యురాలు మంకిడి కిట్టమ్మనారాయణల కుమారుడు మంకిడి ప్రేమ్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందగా ఆదివారం ప్రేమ్ కుమార్ దశ దిన కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ ములుగు నియోజక వర్గం ఇంచార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి జగదీష్ స్థానిక నాయకుల ద్వారా 50 కేజీల బియ్యాన్ని పంపించారు. స్థానిక బిఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, బియ్యాన్ని వారికి అందజేశారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరేం కృష్ణ, తాడ్వాయి మండల యువ నాయకులు తడక సాయి కిరణ్, ఎల్పి వెంకటేష్, మంకిడి రవి, మంకిడి కోటేష్, మంకిడి సంతోష్, మంకిడి రఘు, యాలకొండ నాగేష్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



# స్పాట్ అడ్మిషన్లలో విద్యార్థులకు అండగా ఎంపి కావ్య

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపే వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మరోసారి తన స్పందనతో విద్యార్థులకు అండగా నిలిచారు. ఈరోజు వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో నిర్వహించిన స్పాట్ కౌన్సిలింగ్ సందర్భంగా ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టీసీ) లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య కీలక సహాయం అందించారు.రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో చదివిన మంచిర్యాల జిల్లాకు చెందిన డి. ఆశిత్‌తో పాటు మరో విద్యార్థి, టీసీ ఆలస్యంతో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనలేని పరిస్థితి ఏర్పడింది. అవసరమైన ఒరిజినల్ పత్రాలు లేకపోవడంతో కళాశాల యాజమాన్యం అడ్మిషన్ ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది.ఈ విషయం పై విద్యార్థులు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను సంప్రదించి తమ సమస్యను వివరించారు. విద్యార్థుల ఆవేదనను గమనించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య తక్షణమే స్పందించి, స్వయంగా కళాశాల ప్రిన్సిపాల్ మరియు సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఒరిజినల్ టీసీ సమర్పణకు కొంత గడువు ఇవ్వాలని, చిన్నపాటి ఆలస్యంతో విద్యార్థుల విద్యాసంవత్సరం వృథా కాకుండా స్పాట్ అడ్మిషన్‌లో వారికి అవకాశం కల్పించాలని అధికారులను కోరారు.వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి పట్ల అధికారులు సానుకూలంగా స్పందించి, విద్యార్థులకు తాత్కాలిక అవకాశం కల్పిస్తూ సీట్లు కేటాయించేలా చర్యలు చేపట్టారు. దీంతో అడ్మిషన్ కోల్పోయే పరిస్థితిలో ఉన్న విద్యార్థులకు పెద్ద ఊరట లభించింది.ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "ఒక ఫోన్ కాల్‌తో మా భవిష్యత్తును కాపాడారు. సమయానికి స్పందించి మా విద్య కొనసాగేందుకు సహకరించారు" అని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.విద్య, ఉపాధి, యువత సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ ప్రతి సమస్యపై వెంటనే స్పందిస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, విద్యార్థులకు అండగా నిలుస్తూ మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు.

## మృతుడి కుటుంబానికి బిఆర్ఎస్ నాయకుల పరామర్శ



**ప్రజాపక్షం/రాయపర్తి:**మండల కేంద్రంలోని కొత్త రాయపర్తి కాలనీలోని నిరుపేద కుటుంబానికి చెందిన సదిరపు యాకయ్య మరణించగా ఆదివారం ఆయన పార్థివ దేహానికి బిఆర్ఎస్ నాయకులు లేతాకుల రంగారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, వార్డు మెంబర్ గారె కళ్యాణి విష్ణు, గారె సమ్మయ్య, గారె బిక్షపతి, గారె ఎల్లయ్య, గారె కుమార్, సదిరపు వెంకన్న, సదిరపు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టును పరామర్శించిన మాజీ కార్పొరేటర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** సమాజాన్ని చైతన్యవంతం చేసే జర్నలిస్టులు అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని మాజీ కార్పొరేటర్ దిడ్డి నాగరాజు అన్నారు. శివనగర్‌కు చెందిన జర్నలిస్టు సత్యం ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న నేపథ్యంలో మాజీ కార్పొరేటర్ దిడ్డి నాగరాజు జర్నలిస్టు స్వగృహానికి చేరుకొని పరామర్శించి త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనారోగ్యానికి గురైన వెంటనే మెరుగైన వైద్య సహాయం పొందాలని సూచించారు.

## పిల్లల సంక్షేమం కోసం పలు డిమాండ్లు

**ప్రజాపక్షం/నెక్కొండ:** పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించాలని వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని పేరెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పలు కీలక డిమాండ్లతో కూడిన ప్రకటనను ఆదివారం విడుదల చేసింది. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, తగిన తరగతి గదులు, బాలురు...బాలికలకు ప్రత్యేకంగా పరిశుభ్రమైన మరుగుదొడ్లు, బాలికల కోసం ప్రత్యేక వసతులు, గాలి వెలుతురు ఉండే తరగతి గదులు ఏర్పాటు చేయాలని కోరింది. బాధ్యతగల అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన, రోజువారీ క్రీడలకు సమయం, వారానికి ఒకసారి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించకుండా చర్యలు తీసుకోవాలని, పాఠ్య పుస్తకాల బరువు, హోంవర్క్ భారం తగ్గించాలని కోరింది. ప్రతి పాఠశాలలో సిసి కెమెరాలు, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు, విశాలమైన ఆట స్థలాలు, అనుభవం కలిగిన పిఈటిలు, ప్రత్యేక భోజనశాల, చిన్నారుల కోసం మహిళా సహాయక సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొంది. దీనిపై ప్రభుత్వం స్పందిస్తుందని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల వాహనాల్లో సీట్ల సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించకుండా ఆర్‌టిఏ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని, ప్రతి వాహనానికి డ్రైవర్‌తో పాటు సహాయకుడు ఉండాలని డిమాండ్ చేసింది. ప్రతి పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఏర్పాటు చేసి ఫీజుల నియంత్రణలో భాగస్వామ్యం కల్పించాలని, ప్రతి సంవత్సరం అంతర్ పాఠశాల క్రీడా పోటీలు నిర్వహించాలని కోరింది. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని నర్సంపేట డివిజన్ పేరెంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

## కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం

సిఐటియు రాష్ట్ర కోశాధికారి

వంగూరు రాములు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరు ఉద్యమించాలని సిఐటియూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ కాశిబుగ్గ ప్రాంతంలో సిఐటియూ వరంగల్ జిల్లా విస్తృత సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పైన, రైతులపైన, వ్యవసాయ కూలీలపైన అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మికులకు 29 అనుకున్న చట్టాలు రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురాడం నిర్బంధంగా అమలు చేస్తామని అన్నారు. కాదని తక్షణమే కార్మికులకు నష్టపరిచే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన యావత్తు దేశ వ్యాప్తంగా కార్మికులంతా వ్యతిరేకిస్తున్నప్పటికి ఈ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయకుండా, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చి దేశ సంపదను కట్టబెట్టే కుట్రలు చేసిందని ఈ చర్యలు తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు విద్యుత్ బిల్లు, విత్తన సవరణ చట్టం వ్యవసాయ కూలీలకు గ్రామీణ ఉపాధి హామీ రద్దు చేసి, విబిజి రాంజీ పథకం తీసుకొచిచ ఇటు కార్మిక వ్యవసాయపరంగా కూలీలకు గాని పెద్దయెత్తున కుట్రలు చేసి అన్యాయానికి ఒడిగట్టిందని చేసిందని ప్రభుత్వం మీ చర్యలన్ని వెనక్కి తీసుకోకుంటే సిఐటియూ కార్మిక రైతు, రైతు కూలీల సంఘాలు కలుపుకొని ఐక్య ఉద్యమాలు చేపడతామని ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ వరంగల్ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, వరంగల్ జిల్లా వ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా ఉద్యమించేందుకు ముందుకు రావాలని దాని కోసం వరంగల్ జిల్లాలో ఉన్న అన్ని మండలాల్లో ప్రజలు ఉద్యమాల్లో పాల్గొని పోరాటాలు ఉద్యమాలకు సహకరించాలని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియూ జిల్లా కోశాధికారి జన్ను ప్రకాష్, ఉపాధ్యులు ఇనుముల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు సింగారపు కృష్ణ, జిల్లా ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడుతాటికాయల రత్నం, అధ్యక్షులు మొగుళ్ళ అనిల్, ఎండి మహబూపాషా, హమాలీ నాయకులు యాదగిరి, జిల్లా కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనంపై కూలిన భారీ వృక్షం

**ప్రజాపక్షం /సంగెం:** మండల పరిధిలోని ఆశాలపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఘోర ప్రమాదం సంభవించింది. రహదారి గుండా వెళ్తున్న ద్విచక్ర వాహనంపై ఒక్కసారిగా భారీ వృక్షం కూలిపడిన ఘటనలో భార్యాభర్తలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్వతగిరి మండల కేంద్రంలోని విశ్వజనిత్ స్కూల్ హెడ్మాస్టర్‌గా విధులను నిర్వహిస్తున్న హరి కుమార్, తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వరంగల్ వైపు ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో వారు సంగెం మండలంలోని ఆశాలపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ సమీపానికి చేరుకోగానే, రోడ్డు పక్కన ఉన్న ఒక పెద్ద చెట్టు అకస్మాత్తుగా వేర్లతో సహా వారిపై కూలిపోయింది.

**స్థానికుల సత్వర స్పందన..**

చెట్టు విరిగి బైక్‌పై పడటంతో తీవ్ర గాయాలపాలైన దంపతులు వాహనంతో సహా అక్కడికక్కడే కిందపడిపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానిక గ్రామస్తులు, తోటి వాహనదారులు క్షణాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బైక్‌పై పడిన భారీ కొమ్మలను తొలగించి, క్షతగాత్రులను అప్రమత్తంగా బయటకు తీశారు.

**ఆసుపత్రికి తరలింపు:**

అనంతరం స్థానికులు వెంటనే 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి



చేరుకున్న 108 సిబ్బంది గాయపడిన హరి కుమార్ దంపతులకు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనపై ఆరా తీస్తున్నారు.

## బిఎల్ఎలు సమన్వయంతో పనిచేయాలి:ధరావత్ సురేష్ నాయక్



**ప్రజాపక్షం/కొడకండ్ల:** మండలంలోని ప్రతి ఓటరు ఓటు నమోదు చేసుకునేలా బిఎల్ఎలు బాధ్యతాయుతంగా పని చేయాలని కొడకండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన బిఎల్ఎల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సి రెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, పార్టీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం బిఎల్ఎలకు బుక్‌లెట్లు, గుర్తింపు కార్డులను పంపిణి చేశారు. కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్, వెంకటేశ్వర రావు, క్రాంతి కుమార్ గౌడ్, ఉమా అంజయ్య, కొమురయ్య, రవి, సీనియర్ నాయకులు వెంగళరావు, యాకయ్య, మదుసూధన్, యాకేష్ యాదవ్, శివకుమార్, పాల్గొన్నారు.

## అక్రమ వధశాలపై దాడి లక్ష విలువైన మాంసం సీజ్

**ప్రజాపక్షం/జనగామటౌన్:** జనగామ పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న మాంస వధశాలపై మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సుమారు 120 కేజీల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.1లక్ష విలువైన ఈ మాంసాన్ని సీజ్ చేసి ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా స్లాటర్ హౌస్ ప్రాంగణంలో శాస్త్రీయ పద్ధతిలో పూడ్చి వేశారు. ప్రభుత్వ అనుమతి ఉన్న వధశాలకు జంతువులను తీసుకురాకుండా అక్రమంగ వధ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించి సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించడంతో పాటు రూ.30వేల జరిమానా విధించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ గోపయ్య, వార్డు అధికారులు కుమార్, నిఖిల్, వేఖర్, జవాన్లు తిరుమల రాజు, కృష్ణ, లక్ష్మణ్, మున్సిపాలిటీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా 'సర్' ప్రక్రియలో ఓటర్ల నమోదు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** ఎస్ఐఆర్ ఓటర్ల నమోదు ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని మాజీ జెడ్పిటిసి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇల్లందుల బేబీ శ్రీనివాస్ అన్నారు. మాజీ డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు షాపల్లి, సూరారం, తిమ్మాపూర్, హిమ్మత్‌నగర్ గ్రామాలలో సర్పంచ్‌లు సుభాష్, ప్రభాకర్, సమ్మయ్య, మమత సోమయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ సమావేశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిఎల్ఓలకు బిఎల్ఎలు సమన్వయంతో పనిచేస్తూ ఓట్ల నమోదు, మార్పులు, కొత్త ఓట్ల నమోదు, ఫారాలను నింపడంలో వహించాలని సూచించారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ బిఎల్ఎలు సతీష్, ప్రభాకర్, తిరుపతి, రాజు, సోమయ్య, వీరస్వామి, వెంకట్య, బిఎల్ఓలు శారద, రాజమణి, విజయలక్ష్మి, మల్లేశం, సుల్తానా, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కుటుంబానికి సహాయం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రాపోలు లక్ష్మణ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ రాపోలు లక్ష్మణ్ మీడియాలో సుదీర్ఘకాలం నిబద్ధతతో పని చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ వెంకన్న యాదవ్, ట్రస్ట్ చైర్మన్ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి హరీష్, కోశాదికారి కుమారస్వామి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.